క్లుప్తంగా

వైభవంగా చక్రస్నానం



స్వామి, అమ్మవార్లకు నిర్వహిస్తున్న చక్రస్నానం

ఉంగుటూరు : నారాయణపురంలో జాతీయ రహదారి వెంబడి ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయ దశమ వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం ఆగమ అర్చకులు వేదమంత్రాల నడుమ శాంతి హోమం, చక్రస్నానం అత్యంత వైభవంగా నిర్వహించారు. శాంతి హోమంలో పూర్ణాహుతి సమర్పించారు. ఈ కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఉత్సవాలు ఈనెల 28వరకు కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు.

నేడు బువ్వనపల్లిలో గడపగడపకు మన ప్రభుత్వం

నిడమర్రు : బువ్వనపల్లి-1 సచివాలయం పరిధిలో బుధవారం ఉదయం 8 గంటల నుంచి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సంకు సత్యకుమార్ తెలిపారు. ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు పాల్గొని గ్రామంలో ఆయా కుటుంబాలకు ప్రభుత్వపరంగా అందిన ఆర్థిక లబ్ధి వివరించి, వారి సమస్యలు తెలుసుకుంటారన్నారు. ఈ కార్యక్రమం విద్యుత్ సబ్ స్టేషన్ నుంచి ప్రారంభమై పార్టీ నేత సంకు నాగేషు కార్యాలయం మీదుగా గ్రామ దేవత వడలమ్మ ఆలయం వరకూ ఉంటుందన్నారు. అధిక సంఖ్యలో పార్టీ శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేడు అభయాంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు

పెదపాడు : మండలంలోని అప్పనవీడు గ్రామంలో వేంచేసియున్న శ్రీ అభయాంజనేయస్వామి దేవస్థానంలో బుధవారం స్వామివారి జన్మనక్షత్రం సందర్భంగా స్వామి వారికి పన్నీరుతో అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి తెలిపారు. ఈ పూజా కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలను స్వీకరించాలని కోరారు.

బాలకృష్ణకు అభినందనలు



బాలకృష్ణను అభినందిస్తున్న పుండరీకాక్షుడు

ఉంగుటూరు : ఉంగుటూరు మండల సచివాలయాల కన్వీనర్‌గా ఉంగుటూరు-1 ఎంపీటీసీ పెనుగొండ బాలకృష్ణకు నియామక పత్రాన్ని ఎమ్మెల్యే వాసుబాబు సోదరుడు, వైఎస్సార్ సీపీ నాయకుడు పుప్పాల పుండరీకాక్షుడు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా శాలువా కప్పి బాలకృష్ణను అభినందించారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ మరడ మంగరావు, పార్టీ నియోజకవర్గ బీసీ నాయకుడు కొరిపల్లి శ్రీనివాసరావు, ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి పార్టీ నాయకులు బాలకృష్ణను అభినందించారు.

గ్రామాల్లో క్షేత్రస్థాయి వైద్యం



ఎంఎల్‌హెచ్‌పీలకు హెల్త్ అండ్ వెల్‌నెస్ కిట్‌లను పంపిణీ చేస్తున్న డాక్టర్ పూర్ణిమ

పెదవేగి : గ్రామాల్లో ప్రజలకు క్షేత్రస్థాయిలో వైద్యసేవలందించేందుకు ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోందని పెదవేగి ప్రాథమిక వైద్యశాల డాక్టర్ పి.పూర్ణిమ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని 27 వైఎస్సార్ విలేజ్ క్లీనిక్ సెంటర్‌లకు జిల్లా వైద్యాధికారి కార్యాలయం నుంచి వచ్చిన 67 రకాలతో కూడిన హెల్త్ అండ్ వెల్‌నెస్ కిట్‌లను అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉంటూ 12 రకాల వైద్యసేవలు అందించడానికి విలేజ్ క్లినిక్స్ ఉపయోగకరంగా ఉన్నాయని అన్నారు. పేదలపై ఆర్థిక భారం పడకుండా గ్రామంలోనే అన్ని రకాల వైద్యసేవలు అందుబాటులో ఉంటాయని, ప్రభుత్వం వైద్య పరీక్షలతో పాటు అన్ని రకాల మందులను పంపిణీ చేసిందని ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి పూర్ణిమ సూచించారు.

ఎంపీడీవో ఆకస్మిక తనిఖీ

పెదవేగి : గడప గడపకు మన ప్రభుత్వంలో వచ్చిన ప్రతి సమస్యను పరిష్కరించాలని పెదవేగి ఎంపీడీఓ జి రాజ్‌మనోజ్ చెప్పారు. అమ్మపాలెం, విజయరాయి, రాయన్నపాలెం సచివాలయాలను, రైతు భరోసా కేంద్రాలను ఎంపీడీఓ మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. సచివాలయాల్లో ఇటీవల జరిగిన గడపగడపకు మన ప్రభుత్వంలో వచ్చిన ఫిర్యాదులు, వివిధ సమస్యలను పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. రైతు భరోసా కేంద్రాల్లో సరైన సేవలు అందుతున్నాయా, లేదనే విషయాలను ఇన్‌చార్జిలను, స్థానిక రైతులను అడిగి తెలుసుకున్నారు. విజయరాయిలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఆయన వెంట సచివాలయాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ లబ్ధి

- దెందులూరు ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి
- గోగుంటలో గడప గడపకు మన ప్రభుత్వం



ప్రభుత్వ పథకాలను వివరిస్తూ కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

పెదపాడు : ప్రజలకు సంక్షేమ పథకాలు సక్రమంగా అందించేందుకే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి తెలిపారు. పెదపాడు మండలంలోని గోగుంట గ్రామంలో మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు అమలు తీరుపై ఆరా తీశారు. పథకాల లబ్ధిని వివరిస్తూ లబ్ధిదారులకు కరపత్రాలు అందజేశారు. రహదారులు, డ్రెయినేజీలు నిర్మించాలని, రైతు భరోసా అందడం లేదని, వసంతవాడ సచివాలయ పరిధిలో శ్మశాన వాటికకు ప్రహరీ నిర్మించాలని, కమ్యూనిటీ హాల్ నిర్మించాలని, పోలీస్ స్టేషన్ అభివృద్ధి చేయాలని పలువురు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తామని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు. వసంతవాడ గ్రామ సచివాలయంలో 125 అర్జీలు వచ్చాయని, వాటి పరిష్కారానికి గ్రామ సచివాలయ సిబ్బంది కృషి చేయాలని, ఎప్పటి కప్పుడు సచివాలయాల వారీగా మోనటరింగ్ చేయాలని ఎంపీడీవోను ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి మాట్లాడుతూ గోగుంటలో టీడీపీ సర్పంచ్ అభ్యర్థికి ఇన్‌పుట్ సబ్సిడీ, వైఎస్సార్ ఆరోగ్య ఆసరా, ఆరోగ్యశ్రీ, జగనన్న వసతి దీవెన, రైతు భరోసా, విద్యాదీవెన, డ్వాక్రా రుణమాఫీ పథకాల ద్వారా రూ.2 లక్షల 50 వేల పైగా లబ్ధి చేకూర్చడం జరిగిందన్నారు. కుల, మత, వర్గ పార్టీ భేదాలు లేకుండా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ లబ్ధి చేకూర్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పెదపాడు ఎంపీపీ బత్తుల రత్నకుమారి, గోగుంట సొసైటీ అధ్యక్షుడు భావరాజు సత్యన్నారాయణ, పార్టీ మండల కన్వీనర్ అప్పన ప్రసాద్, సీనియర్ నాయకులు సంబంగి సత్యన్నారాయణ, ఎంపీటీసీ కలపాల ఆదిలక్ష్మి, గోగుంట సొసైటీ త్రీమెన్ కమిటీ సభ్యుడు వల్లూరు శ్రీనివాసరావు (దత్తుడు), సర్పంచ్ తుమ్మల గిరిజ గోపాలకృష్ణ, నాయకులు విజయరాజు, పోకల రాంబాబు, కడిమి గోవిందరావు, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

పరిశుద్ధ నిత్యసహాయ మాత ఊరేగింపు



నిత్యసహాయమాత ఊరేగింపు నిర్వహిస్తున్న ఫాదర్ డేవిడ్, గ్రామస్తులు

దెందులూరు : పోతునూరులో పరిశుద్ధ నిత్యసహాయమాత పండుగ ఘనంగా జరిగింది. మంగళవారం పోతునూరు ఆర్‌సీఎం చర్చి ఫారీస్ క్రిస్ట్ ఫాదర్ డేవిడ్ అమ్మవారి ప్రతిమతో సంఘస్తులు, మరియదళ సభ్యులు, గ్రామపెద్దలతో కలిసి గీతాలు ఆలపిస్తూ ఊరేగింపు నిర్వహించారు. తొలుత స్థానిక ఆర్‌సీఎం చర్చిలో ఫాదర్ డేవిడ్ దివ్యబలిపూజ అర్పించారు.

గోగుంట సొసైటీలో రూ.80 కోట్ల వ్యాపారం



వసంతవాడలో బస చేసి స్థానిక నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

పెదపాడు : సహకార సంఘాలు రైతులకు వెన్నుముఖగా నిలుస్తున్నాయని దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. మంగళవారం గోగుంట విశాల సహకార సంఘం వద్ద స్థానిక విలేకరుల సమావేశంలో సొసైటీ ప్రగతిని వివరించారు. ఈ సందర్భంగా అబ్బయ్యచౌదరి మాట్లాడుతూ గోగుంట విశాల సహకారసంఘం అధ్యక్షునిగా ఉన్న భావ రాజు సత్యన్నారాయణ రూ.40కోట్లు ఉన్న సొసైటీ టర్నోవర్‌ను రూ.80కోట్లకు చేర్చేలా కృషి చేశారన్నారు. గతంలో రూ.17 కోట్లు ఉన్న బ్యాంకు డిపాజిట్లు రూ.40 కోట్లకు చేరాయన్నారు. ఎన్‌పీఏ లేకుండా రైతుల పక్షాన నిలుస్తున్నాయని చెప్పారు. రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తూ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోనే మొదటి రెండు స్థానాల్లో ఈ సొసైటీ నిలిచిందన్నారు. ఇంతటి కృషి చేసిన త్రీమెన్ కమిటీ చైర్మన్ భావరాజు సత్యన్నారాయణ, సభ్యులు, సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలోసొసైటీ త్రీమెన్ కమిటీ చైర్మన్ భావరాజు సత్యన్నారాయణ మాట్లాడుతూ సొసైటీ రూ.95 లక్షల లాభాలు ఆర్జించడం జరిగిందని, దీనిలో 17 శాతం రైతులకు డివిడెండ్‌గా అందించామన్నారు. దెందులూరు ఎమ్మెల్యే సొసైటీని సందర్శించడం ఆనందదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తుమ్మల గిరిజ గోపాలకృష్ణ, ఎంపీపీ బత్తుల రత్నకుమారి, ఎంపీటీసీ కలపాల ఆదిలక్ష్మి, త్రీమెన్ కమిటీ సభ్యుడు వల్లూరు శ్రీనివాసరావు(దత్తుడు) సొసైటీ సీఈఓ రామారావు సంబంగి శ్రావణ్‌కుమార్ వివిధ గ్రామాల నాయకుడు కార్యకర్తలు పాల్గొన్నారు.

వసంతవాడలో అబ్బయ్యచౌదరి పల్లె నిద్ర

పెదపాడు : గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి పల్లె నిద్ర చేశారు. వసంతవాడలోని స్థానిక నాయకుడు సంబంగి శ్రావణ్‌కుమార్ నివాసంలో నాయకులతో కలసి మంగళవారం రాత్రి బసచేశారు. గ్రామాల్లో ఎదురొతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు అంతా ఒక్కటిగా పనిచేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించినట్లు ఎమ్మెల్యే చెప్పారు. గ్రామాల్లో ఎలాంటి వివాదాలు, విబేధాలు తావులేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇన్ని సంక్షేమ పథకాల ఘనత సీఎం జగన్‌దే

- ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు
- మల్లపరాజుపేటలో గడప గడపకు మన ప్రభుత్వం



ప్రభుత్వ పథకాల అమలుపై ప్రజలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే వాసుబాబు

గణపవరం : రాష్ట్ర చరిత్రలోనే ఇన్ని సంక్షేమ పథకాలను ఏకకాలంలో అమలు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని, అందుకే ప్రజల్లో వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల విశేష ఆదరణ కనిపిస్తోందని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. మంగళవారం గణపవరం మండలం అప్పనపేట పంచాయతీ పరిధిలోని మల్లపరాజుపేటలో 122వ రోజు నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనా సమయంలో రాష్ట్ర ఆదాయం పడిపోయి, ఆర్థిక సమస్యలు ఎదురైనా ముఖ్యమంత్రి పేదల సంక్షేమం విషయంలో వెనకడుగు వేయకుండా, అన్ని సంక్షేమ పథకాలను నిర్ణీత తేదీలలో అమలు చేస్తున్నారని అన్నారు. రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఈసందర్భంగా ఇంటింటికి తిరిగి మూడున్నరేళ్లలో ప్రభుత్వం ఆయా కుటుంబాలకు అందించిన పథకాల లబ్ధిని వివరించి లబ్ధిదారులకు కరపత్రాలు అందజేశారు. నవరత్నాల పథకాల ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి పేద కుటుంబాన్ని ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా పెట్టుకుని ముందుకు సాగుతున్నారని అన్నారు. ఇది జీర్ణించుకోలేని ప్రతిపక్షాలు, పచ్చమీడియా నిత్యం చిన్నచిన్న లోపాలను భూతద్దంలో చూపుతూ ప్రజలను ఏమార్చడానికి కుట్రలు పన్నుతున్నారని, ప్రజలు వీటి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. తమకు ఇళ్లస్థలాలు ఇవ్వాలంటూ పలువురు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, కొందరు రోడ్లు, డ్రెయినేజీ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా ప్రాధాన్యత క్రమంలో వాటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అర్ధవరం రాము, జెడ్పీటీసీ దేవారపు సోమలక్ష్మిబాబు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దండు రాము, ఎంపీటీసీ కొల్లి సత్యనారాయణ, సర్పంచ్ నక్కా సూరిబంగారయ్య, ఉప సర్పంచ్ నూకారపు సుధాకర్, మాజీ సర్పంచ్ మతల శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ వగ్రే వెంకట సత్యనారాయణ, పిప్పర, కేశవరం సొసైటీ అధ్యక్షుడు కొలనువాడ శ్రీనివాసరాజు, దండు మురళీకృష్ణంరాజు, జిల్లా పార్టీ కార్యదిర్శ దండు సూరిబాబు, గ్రామ పార్టీ నాయకులు సి.వెంకటేశ్వరరావు, రెడ్డి రామకృష్ణ, అంజూరి ఏసు, నక్కా వెంకట్రావు, తోట మాణిక్యాలరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వృద్ధుల హెల్ప్‌లైన్ పోస్టర్ ఆవిష్కరణ



వృద్ధుల హెల్ప్‌లైన్ 14567 వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న హౌసింగ్ ఈఈ సోమేశ్వరరావు, అధికారులు

భీమడోలు : వృద్ధుల హక్కులను పరిరక్షించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని హౌసింగ్ ఈఈ యు.సోమేశ్వరరావు అన్నారు. భీమడోలు పంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం ఎన్‌ఆర్‌జీఎస్ శాఖ ఆధ్వర్యంలో వివిధ శాఖలకు సంబంధించిన అంశాలపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ఎంపీడీవో జీఎల్‌ఎస్‌వీ రాఘవన్ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా ఈఈ యు.సోమేశ్వరరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా జాతీయ వృద్ధుల హెల్ప్‌లైన్ 14567 పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ఇంకా 681 మంది ఇండ్ల నిర్మాణాలు చేపట్టలేదని, వారిని చైతన్యపర్చి నిర్మాణాలు ప్రారంభించేలా గ్రామ స్థాయిలో సచివాలయాలు, డ్వాక్రా సంఘాల ప్రతినిధులు కృషి చేయాలన్నారు. నాడు-నేడు పాఠశాలల్లో భవన నిర్మాణాల పనులు వేగవంతం చేయాలన్నారు. డిజిటల్ లైబ్రరీ, ఇతర ప్రభుత్వ వనాలను గ్రామస్థాయిలో ప్రజాప్రతినిధులతో చర్చించి నిర్మాణాలు ప్రారంభించాలన్నారు. కార్యక్రమంలో మానవత సేవా సంస్థ జిల్లా అధ్యక్షుడు రామిశెట్టి గంగాధరరావు, ఏఈలు సీహెచ్ సతీష్, డి.సత్యనారాయణ, ఏపీఎం సురేష్‌కుమార్, ఏపీవో కె.పద్మ, సచివాలయ ఉద్యోగులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

రైతు ట్రాక్టర్ల ర్యాలీని జయప్రదం చేయాలి



కైకరంలో నిర్వహించిన సదస్సులో మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లాకార్యదర్శి కె శ్రీనివాసరావు

ఉంగుటూరు : కేంద్రం హామీ మేరకు మద్దతు ధరల గ్యారంటీ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్త సంయుక్త కిసాన్ మోర్చా ఇచ్చిన పిలుపులో భాగంగా ఈనెల 26న ఏలూరులో నిర్వహిస్తున్న రైతు ట్రాక్టర్ల ర్యాలీని జయప్రదయం చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె. శ్రీనివాస్ పిలుపునిచ్చారు. కైకరం ఎల్‌ఐసీ కల్యాణ మండపంలో మంగళవారం నిర్వహించిన రైతు సమావేశంలో ర్యాలీ కరపత్రాలను ఆవిష్కరించారు. రైతు సంఘం సీనియర్ నాయకులు గుత్తికొండ వెంకటకృష్ణారావు అధ్యక్షతన జరిపిన సమావేశంలో శ్రీనివాస్ మాట్లాడుతూ రైతులు ట్రాక్టర్లతో ఈ ర్యాలీలో పాల్గొనాలని కోరారు. ఈ సమావేశంలో కౌలు రైతు సంఘం జిల్లా కన్వీనర్ కోర్ని అప్పారావు, జిల్లా కోకన్వీనర్ వెజ్జు శ్రీరామచంద్రమూర్తి, చిత్తా వేంకటేశ్వరరావు, వరి శ్రీరాములు, పొడుగురాజు, మోగల అప్పారావు, అడపా సురేష్ పాల్గొన్నారు.

మొక్కల పెంపకం ద్వారా పర్యావరణ పరిరక్షణ సాధ్యం

భీమడోలు : మొక్కలు పెంచడం ద్వారా పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని ఎంపీడీవో జీఎల్‌ఎస్‌వీ రాఘవన్ అన్నారు. భీమడోలు హైస్కూలు రోడ్డులోని డివైడర్ వెంబడి మంగళవారం జాతీయ ఉపాధి హామీ పథకం, చైతన్య యువజన సంఘం ఆధ్వర్యంలో నర్సరీలోని మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఎంపీడీవో జీఎల్‌ఎస్‌వీ రాఘవన్ మాట్లాడుతూ మొక్కలను కాపాడడం ద్వారా ప్రతి ఒక్కరూ ఆరోగ్యవంతులవుతారన్నారు. మొక్కలు జీవకోటి మనుగడకు జీవనాధారమని పేర్కొన్నారు. నాటిన మొక్కలను సంరక్షించేందుకు తగు చర్యలు చేపట్టాలన్నారు. వాటిని పెంచేందుకు సిబ్బంది తమ వంతు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో చైతన్య యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పాము మాన్‌సింగ్, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు జాతీయ ఓటర్ల దినోత్సవం

దెందులూరు : జాతీయ ఓటర్ల దినోత్సవం బుధవారం దెందులూరు గారపాటి హైమావతిదేవి ఉన్నత పాఠశాలలో తహసీల్దార్ ఎన్‌వీ నాంచారయ్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు మండల ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ గాయత్రి తెలిపారు. నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, సోషల్ వెల్ఫేర్ జిల్లా జాయింట్ డైరెక్టర్ మధుసూదనరావు ముఖ్య అతిథిగా విచ్చేస్తారన్నారు. పాఠశాల విద్యార్థులకు ముగ్గుల పోటీలు, వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేస్తారన్నారు. పాఠశాల నుంచి 9వార్డు సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించనున్నట్లు చెప్పారు

రహదారి భద్రత నియమాలు పాటించాలి



అవగాహన కల్పిస్తున్న ఎస్సై చావా సురేష్‌కుమార్

భీమడోలు : జిల్లాను ప్రమాదరహిత జిల్లాగా రూపొందించడంలో వాహనదారులు భాగస్వాములు కావాలని భీమడోలు ఎస్సై చావా సురేష్‌కుమార్ అన్నారు. భీమడోలులో జాతీయ రహదారి భద్రత వారోత్సవాల ముగింపును పురస్కరించుకుని మంగళవారం ఆటోవాలాలకు భీమడోలు జంక్షన్‌లోని ఓ కల్యాణమండపంలో రహదారి భద్రత నియమాలు, నిబంధనలపై అవగాహన సదస్సును నిర్వహించారు. భీమడోలు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు కూడా రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఎస్సై చావా సురేష్‌కుమార్ మాట్లాడుతూ రహదారి భద్రత నియమాలను పాటించకపోవడం, ఓవర్‌లోడ్‌తో వెళ్లడం, డ్రైవర్లకు సరైన విశ్రాంతి లేకపోవడం, అవగాహన లోపం కారణంగా తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. విద్యార్థి దశ నుంచి ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమ నిబంధనలను పాటించాలని, వాటిపై అవగాహన పెంచుకోవాలన్నారు. 18 ఏళ్లలోపు చిన్నారులు మోటార్‌బైక్‌లను నడిపి ప్రమాదాలు బారిన పడుతున్నారన్నారు. ఇది చట్టరీత్యా నేరమన్నారు. కార్యక్రమంలో ఏఎస్సై వెంకటేశ్వరరావు, హెచ్‌ఎం టి.పుష్పావతి, భీమడోలు, పూళ్ల, గుండుగొలను ఆటో యూనియన్ సభ్యులు, ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది, ఆటోవాలాలు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కామిరెడ్డి నాని

దెందులూరు : వైఎస్సార్ సీపీ సచివాలయ కన్వీనర్‌లు, గృహ సారథులు పార్టీ బలోపేతానికి చిత్తశుద్ధి, అంకితభావంతో కృషిచేయాలని వైఎస్సార్ సీపీ దెందులూరు మండల కన్వీనర్ కామిరెడ్డి నాని అన్నారు. మంగళవారం రామారావుగూడెం సర్పంచ్ పర్వతనేని శ్రావణి సుధీర్ అధ్యక్షతన గృహ సారథులు, జగనన్న సచివాలయ కన్వీనర్లకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కామిరెడ్డి నాని మాట్లాడుతూ పార్టీ ఆశయాలు గుర్తెరిగి పార్టీ నియమ నిబంధనలకు లోబడి పార్టీ బలోపేతం, ప్రజా సమస్యల పరిష్కారానికి తమ వంతు సహాయ సహకారాలు అందించాలన్నారు. సమావేశంలో పార్టీ గ్రామకమిటీ అధ్యక్షుడు పర్వతనేని వెంకట్రాజు, ఎంపీటీసీ కాళి ఈశ్వరయ్య, ఉపసర్పంచ్ కస్సే శ్రీనివాసరావు, నాయకులు పర్వతనేని నరేంద్ర, పేరం ప్రసాద్, పి.బాబ్జి, పుల్లా ప్రసాద్, పేరం రామకృష్ణ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ బాలికా దినోత్సవం



ర్యాలీలో ప్లకార్డులు ప్రదర్శిస్తున్న బువ్వనపల్లి విద్యార్థినులు, ఉపాధ్యాయులు



కాగుపాడులో నిర్వహిస్తున్న ర్యాలీ



భీమడోలు ఉన్నత పాఠశాలలో ప్లకార్డులను చూపుతూ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

నిడమర్రు : బువ్వనపల్లి యూపీ స్కూల్లో మంగళవారం జాతీయ బాలికా దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా గ్రామంలో బాలిక విద్య, ఆరోగ్యం వంటి అంశాలపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. హెచ్‌ఎం ఎస్ పెద్దిరాజు మాట్లాడుతూ ఆడపిల్ల పుట్టిన తర్వాత అనేక ఆంక్షలు విధిస్తుండటంతో నేషనల్ గరల్స్ డెవలప్‌మెంట్ మిషన్ పేరుతో అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. దీనిలో భాగంగా 2008వ సంత్సరం నుంచి స్త్రీ, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ప్రతీ ఏటా జనవరి 24న జాతీయ బాలికా దినోత్సవం జరుపుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో 104 వైద్యులు డాక్టర్ ధర్మేంద్ర, డీఈవో కె.కిశోర్ తదితరులున్నారు.

ఆడపిల్లల సంరక్షణ అందరి బాధ్యత

ఉంగుటూరు : ఆడపిల్లలను సంరక్షించడం అందరి బాధ్యత అని కాగుపాడు ప్రాథమిక ఆసుపత్రి వైద్యురాలు డా.అనూష అన్నారు. మంగళవారం కాగుపాడు, నారాయణపురంలో బాలిక దినోత్సవం నిర్వహించారు. కాగుపాడులో హైస్కూల్ విద్యార్థులు ర్యాలీ, సదస్సు నిర్వహించారు. హెచ్‌ఎం ఉమాదేవి, ఉపాధ్యాయులు శీతాల సత్యనారాయణ, కళ్యాణ్ కుమార్, దుర్గాలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు. నారాయణపురం ఎస్ఏఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన సదస్సులో హెల్త్ ఎడ్యుకేటర్ ఎంవీ సుబ్బలక్ష్మి మాట్లాడుతూ లింగ నిర్ధారణ పరీక్షలు నేరమన్నారు. ఆడపిల్లలను గౌరవించాల్సిన బాధ్యత ఈ సమాజంపై ఉందన్నారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

బాలికలు స్వేచ్ఛగా జీవించాలి

పెదపాడు : బాలికలు స్వేచ్ఛగా జీవిస్తూ తమ హక్కులను కాపాడుకుంటూ తమకు నచ్చిన రంగంలో రాణించాలని జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ పీడీ పద్మావతి అన్నారు. కలపర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా డీఎంహెచ్ కే నాగేశ్వరరావు, డీఆర్‌డీఏ పీడీ విజయరాజు, డీసీపీఓ డాక్టరు సూర్యచక్రవేణి, వార్డు సచివాలయాల సమన్వయకర్త టీఎస్ స్నేహన్ ప్రసంగించారు. అనంతరం జాతీయ బాలికా దినోత్సవం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. నేతలు రమేష్‌బాబు, జాన్ ఇస్రాయేలు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు వద్దు

భీమడోలు : బాల్య వివాహాలు వద్దు.. వారి భవిష్యత్తే ముద్దు అంటూ భీమడోలులో మంగళవారం సచివాలయ ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని భీమడోలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన విద్యార్థినులకు సచివాలయ ఏఎన్‌ఎంలు, విలేజ్ క్లినిక్ సిబ్బంది బాలిక విద్య, ఆరోగ్యం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. భీమడోలులో హెచ్‌ఎం టి.పుష్పావతి మాట్లాడుతూ నేటి సమాజంలో మహిళలు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలన్నారు. ఎంఎల్‌హెచ్‌పీ నాగపద్మ మాట్లాడుతూ కౌమారదశ నుంచి బాలికలు తమ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ యలమర్తి రవీంద్రకుమార్, ఏఎన్‌ఎంలు మురళీ, సుజనీ, చంద్రకళ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆడపిల్ల.. టెన్ సన్స్‌తో సమానం

పెదవేగి : ఆడపిల్ల అంటే టెన్షన్ కాదు,, టెన్ సన్స్‌తో సమానమని పెదవేగి ఎస్సై ఎం.లక్ష్మణ్ అన్నారు. పెదవేగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో జాతీయ బాలికా దినోత్సవం, రోడ్డు భద్రతా వారోత్సవాల సందర్భంగా ఎస్సై ఎం.లక్ష్మణ్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. రోడ్డు మీద ప్రయాణించే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నిబంధనలపై విద్యార్థులకు ఎస్సై అవగాహన కల్పించారు. ఆడపిల్లలకు గుడ్ టచ్, బ్యాడ్‌టచ్ గురించి వివరించారు. అపరిచితులతో ఏ విధంగా నడుచుకోవాలో తెలియజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, మహిళా పోలీస్ ఎం.జ్యోతి పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు

దెందులూరు : ప్రకృతి వ్యవసాయం భవిష్యత్‌లో రైతులందరికీ స్ఫూర్తిదాయకం అవుతుందని ప్రకృతి వ్యవసాయ శిక్షణా సిబ్బంది అన్నారు. మంగళవారం దెందులూరులో పురుగులు, తెగుళ్ల నివారణపై శిక్షణ, పొలంబడి, వ్యవసాయ క్షేత్ర పర్యావరణ, విశ్లేషణ నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో సాగు చేయడం ద్వారా ఖర్చుల తగ్గింపు, అధిక దిగుబడి ఎలా సాధించాలి వంటి అంశాలపై రైతులకు శిక్షణ ఇచ్చారు. మండల శిక్షణా సిబ్బంది పులిపాటి ఆనంద్, సిబ్బంది పాల్గొన్నారు.